సాక్షి
పెద్దపల్లి
శనివారం । 6 । మే । 2023



పర్యాటక కేంద్రంగా గోదావరి

మంథని: మంథనిని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ముందుకు సాగుతున్నట్లు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. మంథని గోదావరి తీరాన్ని శుక్రవారం పరిశీలించారు.



ఆర్థిక స్వేచ్ఛనందిస్తాం

మంథని: ఆర్థిక స్వేచ్ఛనందించడమే న్యూ ఇండియా పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ తిరుపతి పేర్కొన్నారు. ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర శుక్రవారం మంథనికి చేరుకుంది.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యుత్ ఉత్పత్తి దశలోకి బీ-థర్మల్



రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం వేకువజాము నుంచి విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చారు. కాగా ఇటీవల వరి కోతలు పూర్తవడంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగం తగ్గిపోయింది. దీంతో బీ-థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉంచాలని విద్యుత్‌సౌధ నుంచి ఆదేశాలు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకురావాలని గురువారం రాత్రి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చినట్లు ఇంజినీర్లు తెలిపారు.

ఆరుకాళ్లతో గొర్రెపిల్ల జననం



పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం బొంపల్లిలో శుక్రవారం పంబాల కుమార్‌కు చెందిన గొర్రె కవలపిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఓ గొర్రెపిల్ల ఆరుకాళ్లతో పుట్టింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు గొర్రెపిల్లను ఆసక్తిగా చూశారు.

బౌద్ధస్తూపం అభివృద్ధి చేయండి



ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ధూళికట్టలోని బౌద్ధస్తూపాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ శుక్రవారం వాటర్‌ట్యాంక్ ఎక్కి మాజీ సర్పంచ్ దేవ శ్రీనివాస్ నిరసన తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బౌద్ధస్తూపాన్ని అభివృద్ధి చేస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి తీరా అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ధూళికట్టలోని ఎల్లమ్మ ఆలయం నుంచి బౌద్ధస్తూపం వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ చేరుకొని సముదాయించి, కిందికి వచ్చేలా చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహరరెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు ఫోన్‌లో మాట్లాడి స్తూపం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందనలు



పెద్దపల్లిరూరల్: కోరుకొండ సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి హర్షిత్‌ను కలెక్టర్ సంగీత అభినందించారు. ఆలిండియా స్థాయిలో 1999వ ర్యాంకుతో సీటు సాధించిన హర్షిత్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. డీఈవో మాధవితోపాటు హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయుడు సురేందర్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి సన్మానం



గోదావరిఖనిటౌన్: గోదావరిఖని కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి బదిలీపై కామారెడ్డికి వెళ్తున్న టీఎస్పీ భార్గవిని శుక్రవారం సన్మానించారు. సీనియర్ సివిల్ జడ్జి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, ప్రధాన కార్యదర్శి బోడ సమ్మయ్య, అడ్వకేట్లు గోషిక ప్రకాశ్, ప్రదీప్‌కుమార్, కుమార్, పెట్టం వెంకటేశ్వర్లు, పీపీ రవీందర్, సంజయ్‌కుమార్, శాంతన్‌కుమార్, మురళీధర్, గోపాల్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

9లోగా అభ్యర్థనలివ్వండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని కేజీబీవీల్లో తాత్కాలిక, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది ప్రస్తుతం చోటు నుంచి మరో చోటికి మారాలనుకుంటే ఈనెల 9వ తేదీలోగా తమ అభ్యర్థనలను సమగ్రశిక్ష వెబ్‌సైట్‌లో సమర్పించాలని డీఈవో మాధవి కోరారు. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు.

అన్నదాత అతలాకుతలం



ఈ చిత్రంలో ధాన్యం కుప్పల నుంచి వరద నీటిని తొలగిస్తున్న రైతు పేరు మేకల కొమురయ్య. మంథని మండలం ఎగ్లాస్‌పూర్. తనకున్న ఏడెకరాలలో వరి సాగు చేశాడు. ఈ సీజన్‌లోనే ఇప్పటికే రెండు సార్లు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టగా శుక్రవారం వచ్చిన వర్షం మూడోసారి ముంచేసింది. దాదాపు రూ.3లక్షలకు పైగానే నష్టపోయాడు.



ముత్తారం మండలం అడవీశ్రీరాంపూర్‌లో వర్షపు నీటిలో మునిగిన ధాన్యం

- అకాల వర్షంతో కొట్టుకుపోయిన ధాన్యం
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- ఈ సీజన్‌లోనే మూడోసారి తడిసిన ధాన్యం
- నిండా మునిగిన కౌలురైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు



శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఒక్కచోటుకు ఊడ్చుకుంటున్న ఈ రైతు నాంపల్లి సారయ్య. మంథని శివారులోని రెండున్నర ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. ఎకరాకు రూ.15వేలు కౌలు చెల్లించి వరి సాగు చేశాడు. పంట కోసి ధాన్యాన్ని మార్కెట్‌యార్డుకు తీసుకురాగా.. అకాలవర్షంతో ధాన్యం తడిసిపోయింది. వరదలో ధాన్యం కొట్టుకుపోవడంతో కౌలు, పెట్టుబడి నష్టపోయానని రోదిస్తున్నాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



మొలకెత్తిన ధాన్యాన్ని చూస్తున్న కంటనీరు పెడుతున్న రైతు ఉత్తర్ల సమ్మయ్య. మంథని మండలంలోని నెల్లిపల్లి స్వగ్రామం. తనకున్న ఏడెకరాలలో వరిసాగు చేశాడు. మూడెకరాలలోని పంట వర్షానికి ఇప్పటికే పడిపోయింది. కోసే పరిస్థితి లేదు. నాలుగెకరాల్లో కోసిన ధాన్యాన్ని మంథని మార్కెట్‌యార్డులో ఆరబోసిండు. శుక్రవారం హఠాత్తుగా వచ్చిన వర్షానికి వరదనీటిలోనే ధాన్యం మునిగింది. మరికొంత కొట్టుకుపోయింది.

మంథని: అకాల వర్షం రైతును నిండా ముంచింది. అప్పటి వరకు ఎండగా ఉన్న వాతావరణం హఠాత్తుగా మేఘావృతమై వర్షం కురవడంతో ధాన్యాన్ని కాపాడుకోలేకపోయారు. టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడం.. ఉన్న కవర్లను కప్పేందుకు ప్రయత్నించేలోపే చెడగొట్టు వాన ధాన్యాన్ని తడిపింది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడిసిముద్ద కాగా.. కోయని పంట పొలంలోనే రాలిపోయింది. మంథని డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం హఠాత్తుగా కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు.

వంద కేంద్రాల్లో తడిసిన ధాన్యం

మంథని వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో సుమారు వంద కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. ఎండకాస్తుండడంతో ధాన్యంపై ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయలేదు. సాయంత్రం వేళ హఠాత్తుగా వచ్చిన వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. మంథని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వందకు పైగా ఉన్న ధాన్యం రాసులు చిందరవందర కావడంతో రైతులు ఆందోళన చెందారు. పంటను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కుటుంబంతో వచ్చి ధాన్యం రాసుల్లో చేరిన నీటిని ఎత్తిపోస్తున్నారు. కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేసుకున్నారు. సమీపంలోనే ఉన్న కాల్వలో ధాన్యం కొట్టుకుపోవడంతో చేసేది లేక కంటతడి పెట్టారు. ఈ సీజన్‌లో మూడోసారి ధాన్యం కొట్టుకుపోయిందని ఈ పరిస్థితుల్లో తాము ఏం చేసేదని రైతులు కంటతడి పెడుతున్నారు.

పదోన్నతుల ‘పంచాయితీ’

- పంచాయతీ రాజ్ విభాగంలో వింత పరిస్థితి
- పదోన్నతి కోసం 84 మంది జూనియర్ అసిస్టెంట్ల ఎదురుచూపులు
- గతేడాది డిసెంబర్‌లోనే సీనియారిటీకి అర్హత
- ఆరునెలలుగా కాలయాపన చేస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడిజిల్లాలో ప్రస్తుతం పదోన్నతుల పంచాయితీ నడుస్తోంది. పంచాయతీరాజ్ విభాగంలో రెండేళ్ల కింద చేరిన జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతికి అర్హత సాధించి దాదాపు ఆరునెలలు కావస్తున్నా.. వారికి ప్రమోషన్ రావడం లేదు. సర్వీస్ రూల్స్ ప్రకారం.. తమకు పదోన్నతి రాకుండా ఉన్నతాధికారులు ఆపేస్తున్నారని జూనియర్ అస్టిస్టెంట్లు ఆరోపిస్తుండగా.. అందరికీ ఒకేసారి ఇద్దామన్న ఆలోచనతో ఉన్నామంటూ ఉన్నతాధికారులు తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. దీంతో ఈ వివాదం క్రమంగా చినికి చినికి గాలివానగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమ పదోన్నతులను కావాలనే ఆపుతున్నారన్న భావన ప్రతీ జూనియర్ అసిస్టెంట్లలో క్రమంగా నాటుకుపోతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లు తమ ఉన్నతాధికారులతో పలుచోట్ల ఘర్షణలకు దిగుతున్నారు.

అసలేం జరిగింది?

2018 జూన్‌లో టీఎస్‌పీఎస్సీ ద్వారా దాదాపు 1500లకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అయింది. అందులో దాదాపు 160 వరకు పంచాయతీరాజ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఉన్నాయి. అదే ఏడాది ఆగస్టులో అభ్యర్థులంతా టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్ష రాశారు. 2020 అక్టోబరులో పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. అదే ఏడాది డిసెంబరులో వీరంతా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లుగా పంచాయతీరాజ్ కార్యాలయాల్లో విధుల్లో చేరారు. ఇందులో వరంగల్ రీజియన్ (కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్)లో దాదాపుగా 84 మందికిపైగా ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20 మందికిపైగా పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరికి గత డిసెంబరులో సర్వీసు రూల్స్ ప్రకారం.. సీనియర్ అసిస్టెంట్ లేదా యూడీసీగా పదోన్నతి రావాలి. కానీ.. అధికారులు ఆ ఫైళ్లను తమ వద్దే పెట్టుకున్నారు. ఆరునెలలుగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు.

కారణాలివే..?

ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాలతోపాటు మిగిలిన పాత ఖమ్మం ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలోనూ జూనియర్ అసిస్టెంట్లు తీవ్ర ఆవేదనలో కూరుకుపోయారు. ఇదే విషయమై తమ ఉన్నతాధికారులతో వాదోపవాదాలకు దిగుతున్నారు. దీంతో కొందరు డిప్యుటేషన్ కోసం ప్రయతిస్తున్నారు. మరికొందరు తమ పదోన్నతులు ఆపారంటూ కొందరు మంత్రులకు మొరపెట్టుకుంటున్నారు. దీనికి అధికారులు ఏం చెబుతున్నారంటే.. ఇటీవల గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల నేపథ్యంలో కొందరు, గర్భం దాల్చిన కారణంగా కొందరు మహిళా సిబ్బంది రెండు నుంచి ఆరునెలల వరకు అధికారికంగా లీవు పెట్టారు. కొన్ని నెలలపాటు సర్వీసులో వెనకబడిన కారణంగా తాము మిగిలిన వారికి పదోన్నతులు ఇవ్వలేకపోతున్నామని, అందరికీ రెండేళ్లునిండిన వెంటనే పదోన్నతులు ఇస్తామని అధికారులు జూనియర్ అసిస్టెంట్లకు వివరణ ఇస్తున్నారు. అయితే.. వీరంతా డిసెంబరు నాటికి విధుల్లో చేరిపోయారు. ఈ లెక్కన ఇప్పటికే ఆరునెలలు కావస్తోంది. అధికారులు చెప్పిన ప్రకారం.. ఇప్పుడు అందరికి రెండేళ్ల సర్వీసు నిండినట్లే. అయినా.. ఎందుకు ఇవ్వడం లేదని జూనియర్ అసిస్టెంట్లు మదనపడిపోతున్నారు. అధికారులు సర్వీసు రూల్స్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- ఘనంగా బుద్ధ జయంతి



బౌద్ధస్తూపం వద్ద ప్రజాప్రతినిధులు

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): గౌతమ బుద్ధుని బోధనలు అనుసరణీయమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ధూళికట్ట, జూలపల్లి మండలం వడుకాపూర్ సరిహద్దున గల హుస్సేనిమియావాగు ఒడ్డున ఉన్న బౌద్ధస్తూపం వద్ద శుక్రవారం బుద్ధ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మానవాళి దుఃఖ నివారణకు బుద్ధుడు చూపిన మార్గం శ్రేయస్కరమన్నారు. మానవుడు తన కోర్కెలను తగ్గించుకుంటేనే శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించగలరన్నారు. బుద్ధుని పంచశీలాలు, అష్టాంగమార్గాలు, దశపారమితలు ఆచరిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొగురం రమేశ్, సర్పంచులు గొల్లె కావేరి, మాంకాళి తిరుపతి, ఎంపీటీసీ సావిత్రమ్మ, కమిటీ సభ్యులు పుల్లయ్య కాంబ్లే, పాటకుల భూమయ్య, మంచాల వెంకటస్వామి, డీటీ అబూబాకర్ పాల్గొన్నారు.

‘టీఎస్ఆర్‌జేసీ’ సజావుగా నిర్వహించాలి

- పరీక్షకు హాజరుకానున్న 7,081 మంది విద్యార్థులు



మాట్లాడుతున్న నవీన్ నికోలస్

కరీంనగర్: ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశంకోసం శనివారం ‘టీఎస్ఆర్‌జేసీ’ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ (శిక్షణ) నవీన్ నికోలస్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆడిటోరియంలో పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు నిర్వహించే పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు 7,081 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఎంపీసీ 4,767, బైపీసీ 2,136, ఎంఈసీలో 178 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు 30 కేంద్రాల్లో 30మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 5 రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణలో ‘సహకారం’!

- సిబ్బంది నుంచి దాదాపు రూ.1.18 కోట్ల వసూలు
- రెండు దశాబ్దాల కల కోసం కప్పం కట్టిన ఉద్యోగులు
- సచివాలయానికి చేరిన మామూళ్ల పర్వం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓ శాఖలో ఉద్యోగుల క్రమబద్ధీకరణలో భారీగా డబ్బులు చేతులు మారాయి. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఉదంతం కలకలం రేపుతోంది. ఉద్యోగుల క్రమబద్ధీకరణ పేరిట జరిగిన ఈ వసూళ్ల పర్వం విలువ దాదాపు రూ.2 కోట్లకు చేరడంతో సదరు ప్రభుత్వశాఖలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. సదరుశాఖలో ఇటీవల దాదాపు 591పోస్టులు రెగ్యులరైజ్ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ మరో రెండు రకాల పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగులంతా దాదాపు 20ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్న క్రమబద్ధీకరణకు ఇటీవల అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

సంబరాన్ని సొమ్ము చేసుకున్నారు

ఈ విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగులకు ముందే సమాచారం అందింది. దాదాపుగా రెండు దశాబ్దాలుగా కొలువుల క్రమబద్ధీకరణకు తమ నిరీక్షణ ఫలించడంతో అంతా కలిసి సంబరాలు చేసుకున్నారు. జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలపరిధిలో మొత్తం 591 ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అంతా సిద్ధమైంది. సరిగ్గా అప్పుడే.. ఉన్నతాధికారుల అనుచరులు రంగంలోకి దిగారు. 591 కుటుంబాలకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని, కాబట్టి ఉన్నతాధికారులకు ప్రతీ ఉద్యోగికి రూ.20వేల చొప్పున మామూళ్లు ఇవ్వాల్సిందేనని సందేశం పంపారు. 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిర్ణయం అమలు కానుందన్న ఆనందంలో చాలామంది ఉద్యోగులు అప్పోసప్పో చేసి అనుచరులు అడిగినకాడికి సమర్పించుకున్నారు. రూ.1.18 కోట్ల వసూలు చేశారు.

ఆగమేఘాల మీద ప్రొసీడింగ్స్

సదరుశాఖలో వసూళ్ల పర్వం పూర్తికాగానే క్రమబద్ధీకరణ పర్వం మొదలైంది. మొత్తం 591 ఉద్యోగాలకు క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్‌తోపాటు, తీర్మానాలు అవసరం. ఇక్కడే అనుచరులు చక్రం తిప్పారు. తీర్మానాల విషయంలో వయసు పైబడిన వాళ్లు, ఇతర అనర్హతలు కలిగిన వారి వద్ద రూ.50వేలకు పైగానే వసూలు చేశారని సమాచారం. తరువాత ఆగమేఘాల మీద 591 మందికి రెగ్యులరైజేషన్ జరిగిపోయింది. వసూళ్ల పర్వం సదరుశాఖలో చర్చనీయాంశంగా మారడంతో ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా హైదరాబాద్‌లోని సచివాలయానికి చేరింది. సదరు విభాగంలో ఉన్నతాధికారి ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారిగా వ్యవహరించారని తెలిసింది. సదరుశాఖ కమిషనర్‌కు విషయం తెలిసి విచారణకు ఆదేశించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

సుల్తానాబాద్‌లో ముస్కాన్ బృందం

- ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర బృందం



సుల్తానాబాద్ ఆస్పత్రిలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని ఢిల్లీకి చెందిన ముస్కాన్ బృందం శుక్రవారం పరిశీలించింది. బృందంలోని సభ్యులు డాక్టర్ వందన, యూనస్, సాగర్ ఆస్పత్రిలోని థియేటర్, లేబర్‌రూమ్, ఫార్మసీ, ల్యాబ్, గైనిక్ రూమ్‌లను పరిశీలించారు. నవజాత శిశుమరణాలు తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ముస్కాన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ స్కీమ్ కోసం దరఖాస్తు చేసుకున్న సుల్తానాబాద్ ఆస్పత్రిని కేంద్ర బృందం సందర్శించింది. ఆస్పత్రిలో పిల్లలకు అందిస్తున్న వైద్యసేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు రమాదేవి, వివిధ విభాగాల సిబ్బంది ఉన్నారు. కేంద్ర బృందం సభ్యులు శనివారం మరోమారు సందర్శించనున్నారు. స్కీమ్‌కు ఎంపికైతే రూ.5లక్షల నగదు అందజేస్తారు.

ముస్తాబైన పోలీస్ కమిషనరేట్



రామగుండం పోలీస్ కమిషనరేట్ భవనం

గోదావరిఖని: ఎట్టకేలకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర వహించే రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రారంభానికి తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఇప్పటికే రెండుసార్లు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబై వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈనెల 8న రామగుండం నియోజకవర్గ పర్యటనకు వస్తున్న రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం పోలీస్‌హౌసింగ్ చైర్మెన్ కోలేటి దామోదర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



అధునాతన కాన్ఫరెన్స్ హాల్



ప్రత్యేక విభాగంలో అధునాతన ఫర్నిచర్

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

- రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- గతంలో జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వలేదు
- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



పార్టీ కండువా కప్పుతున్న మక్కాన్‌సింగ్

పాలకుర్తి(రామగుండం): మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వారికి పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పంట రుణమాఫీ చేయలేదని, ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వసించి, రైతులు, యువకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. యువకులు, రైతుల తరఫున కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేశ్, ఒల్లెపు సాయి, పల్లికొండ రాజేశ్, మేడి ఓదెలు, కొంరయ్య, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహునికి చందనోత్సవం


చందనోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం చందనోత్సవం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజు ఈ కార్యక్రమం జరుపుతుంటారు. ఈసారి స్వామివారి జయంతి కూడా కలిసి రావడంతో పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

మల్కాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు


ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న అధికారులు, సిబ్బంది

సాక్షి స్పందన

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో విద్యుత్ సమస్యలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఒకసారి హై.. మరోసారి లోఓల్టేజ్ శీర్షికన 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. మరికొన్నిచోట్ల పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ సుదర్శనం, డీఈ శివరాములు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం వంతెనపై చిమ్మ చీకట్లు


చీకట్లో వంతెనపై వాహనాల రాకపోకలు

రామగుండం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో వంతెనపై వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయి. కార్పొరేషన్ అధికారులు స్పందించి, వీధి దీపాలకు మరమ్మతు చేయించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై వినీత తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన పిడుగు వినయ్ శుక్రవారం తన బైక్‌పై స్థానిక స్వప్న కాలనీ వద్ద కరీంనగర్ వైపు మలుపు తిరుగుతున్నాడు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి మంథని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో వినయ్ గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు.

మున్సిపల్ వీధులన్నీ అధ్వానం

- రోడ్లపై గుంతలు.. నిలుస్తున్న వర్షపు, మురికి నీరు
- విలీన గ్రామాల్లో డ్రైనేజీలు కరువు
- పలు కాలనీల్లో మిషన్ భగీరథ లీకేజీలు
- సుల్తానాబాద్‌లో పరిస్థితి


పూసాల వెళ్లే దారిలో రోడ్డుపై నీరు, చదును చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్సిపల్ పరిధిలోని వీధుల్లో నడవాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన తవ్వకాలతో వీధులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. పెద్దపెద్ద గుంతలతో కంకర తేలి, చిన్నపాటి వర్షానికే నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. పైపులైన్ల మరమ్మతు కోసం గుంతలు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. ఇక విలీన గ్రామాల పరిస్థితి మరోలా ఉంది. సుల్తానాబాద్ మున్సిపల్‌లో సుగ్లాంపల్లి, పూసాల విలీనమయ్యాయి. డ్రైనేజీలు నిర్మించకపోవడం, లింకు రోడ్లను కలపకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో దానికి తగినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది.

రోడ్లపై గుంతలు, నీరు..

చిరుజల్లులు పడినా సుల్తానాబాద్ పట్టణంలోని పూసాలకు వెళ్లే రోడ్డుపై మురికి నీరు చేరుతోంది. ఫలితంగా వాహనదారులు, ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. డ్రైనేజీ ఇప్పుడే నిర్మిస్తున్నారు. పనులు వేగవంతంగా చేయాలని వారు కోరుతున్నారు. యాదవ్ నగర్, మార్కండేయ కాలనీ, ఎస్సీ కాలనీ, వ్యవసాయ భూముల్లో కొత్తగా నిర్మిస్తున్న గృహాల మధ్య డ్రైనేజీలు లేవు. శ్రీరాంపూర్ క్రాస్ రోడ్ నుంచి శాంతినగర్ వరకు రోడ్డుపై ఎక్కడచూసినా గుంతలు, వాటిలో నీరే కనిపిస్తోంది. పట్టణంలోని ట్యాంక్ రోడ్డులో వర్షం పడితే చాలు నీరంతా రోజుల తరబడి రహదారిపై నిల్వ ఉంటోంది. పలు కాలనీల్లో భగీరథ పైపులైన్ లీకేజీ సమస్యలున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

వాణిజ్య, వ్యాపార కేంద్రంగా పేరొందిన సుల్తానాబాద్ పట్టణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో వీధుల్లో చెత్త కుప్పలు, కాల్వల్లోని మురుగు పూర్తిగా తొలగడం లేదు. సాయంత్రం కాగానే దోమల బెడద పెరిగిపోతోంది. రాత్రివేళ ఫ్యాన్లు వేసినా దోమల బాధ తప్పడం లేదని, తాము అనారోగ్యం బారిని పడతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

15 వార్డులు.. 25 వేల జనాభా

పట్టణంలో మొత్తం 15 వార్డుల్లో 25 వేల జనాభా ఉంది. రోజూ 2 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త బయటకు వస్తోంది. చెత్త సేకరణకు 80 మంది సిబ్బంది ఉన్నారు. గుర్తించిన 6 జోన్లలో 12 మురికి వాడలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది.

చదును చేయిస్తున్న..



పలు వీధుల్లో డ్రైనేజీ సమస్య ఉంది. పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. రోడ్డుపైకి నీరు వస్తోందని ప్రజలు సమాచారం ఇవ్వగానే మున్సిపల్ సిబ్బందిని పంపి, చదును చేయిస్తున్న.

– ముత్యం సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్, సుల్తానాబాద్

ప్రణాళికలు రూపొందించాలి..



మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడింది. భవిష్యత్ అవసరాల కోసం ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించాలి. రోడ్డుపైకి మురుగునీరు రాకుండా, వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి.

– కుమార్ కిశోర్, కాంగ్రెస్ నాయకుడు, సుల్తానాబాద్

రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- జాఫర్‌ఖాన్‌పేటలో కాకతీయ కెనాల్ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో కాకతీయ కెనాల్ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వ్యవసాయం, సాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడుగు రాజకొమురయ్య, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం, సర్పంచులు దొమ్మటి శ్రీనివాస్, కాసం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కొల్లూరి రమాదేవి, నాయకులు రాయమల్లు, నవీన్, శ్రావన్‌కుమార్, ఆనంద్, చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం


సీటీ స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్, పక్కన మేయర్ అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- జీజీహెచ్‌లో 85 పడకల కొత్త బ్లాక్, సీటీ స్కానింగ్ యంత్రం ప్రారంభం

కోల్‌సిటీ(రామగుండం): పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం జీజీహెచ్ ఆవరణలో రూ.6.5 కోట్లతో నిర్మించిన 85 పడకల కొత్త బ్లాక్‌తోపాటు సుమారు రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్ యంత్రాన్ని శుక్రవారం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త బ్లాక్‌లో సౌకర్యాలు, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఒకప్పుడు 100 కూడా లేని ఇన్‌పేషెంట్ల సంఖ్య నేడు 800 నుంచి 1,100 వరకు ఉంటోందన్నారు. రామగుండం జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని తెలిపారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఈ ఆసుపత్రిలో మరో 330 పడకల కొత్త భవనాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. సీటీస్కానింగ్ యంత్రం ఏర్పాటుతో పేషెంట్లకు ఆర్థిక భారం తప్పనుందని తెలిపారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, అశోక్, అరుణ, రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వస్తే.. ఊపిరి ఆగింది

- గుండెపోటుతో కూలీ మృతి
- మృతుడి స్వగ్రామం మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్


శ్రీనివాస్ (ఫైల్)

సుల్తానాబాద్(పెద్దపల్లి): జీవనోపాధి కోసం వచ్చిన ఓ కూలీ గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్(45)కు భార్య, ఒక కూతురు ఉన్నారు. ఉపాధి నిమిత్తం అతను తన కుటుంబసభ్యులతో కలిసి వారం రోజుల క్రితం సుల్తానాబాద్ వచ్చాడు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తమ సమీప బంధువు ఇంట్లో ఉంటున్నారు. శ్రీనివాస్ నిత్యం కూలీ పనికి వెళ్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఇంటి నిర్మాణ పనులకు వెళ్లి, ఛాతిలో నొప్పి వస్తోందని తోటి కూలీలకు చెప్పాడు. వారు బాధితుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాస్‌ది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని కూలీలు, బంధువులు కోరారు.

ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రెండు దశాబ్దాలుగా ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న లెక్చరర్ల కల ఫలించింది. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిదేళ్లకు ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపింది. ఉమ్మడి జిల్లాలో 58 ప్రభుత్వ కళాశాలల్లో 514 మంది కల ఫలించింది. శుక్రవారం ఆకస్మికంగా కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని అన్ని జిల్లాల్లోని డీఐఈవోలను ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా ఆయా కార్యాలయాల నుంచి అందిన సమాచారం మేరకు తమ ఉత్తర్వులను అందుకునేందుకు కాంట్రాక్ట్ లెక్చరర్లు డీఐఈవో ఆఫీసుల ఎదుట సందడి చేశారు. ఉత్తర్వులు అందుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు.

భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచండి


వీసీలో పాల్గొన్న జీఎం మనోహర్, అధికారులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

గోదావరిఖని(రామగుండం): భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. బొగ్గు ఉత్పత్తిపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్ని భూగర్భ గనుల్లో ఉత్పత్తి వివరాలు, పని స్థలాలు, యంత్రాల పనితీరు, పని స్థలాల అనుమతులు, బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో భూగర్భ గనుల్లో ఎల్‌హెచ్‌డీ, ఎస్‌డీఎల్, కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరు మెరుగుపర్చుకోవాలని చెప్పారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో ముందుకెళ్లాలని అన్నారు. ఆర్జీ–2 జీఎం మనోహర్, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలి..

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సూచించారు. ఏరియాలోని వకీల్‌పల్లిగనిని శుక్రవారం సందర్శించి ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3సీమ్ టాప్‌సెక్షన్, 4సీమ్ ఎల్‌హెచ్‌డీ డిస్ట్రిక్ట్, కంటిన్యూస్ మైనర్ ఉత్పత్తి తీరును తెలుసుకున్నారు. సీఎంపీ డిస్ట్రిక్ట్‌లో పనిస్థలాలు పూర్తయి బొగ్గు నిల్వలు అయిపోయిన దృష్ట్యా సీఎంపీ, ఎల్‌హెచ్‌డీ యంత్రాలకు కొత్త పనిస్థలాల అనుమతుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ వార్షిక లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గని మేనేజర్ రవికిరణ్, సర్వే అధికారి అఫ్సర్‌పాషా, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమాధికారి ఓంకారిబాబు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ వల్లే దేశం నష్టపోయింది

- బజరంగ్‌దళ్‌పై నిషేధం అంశాన్ని మేనిఫెస్టో నుంచి తొలగించండి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: దేశంలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు పాటుపడుతున్న బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామనడం అవివేకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో నిషేధం అంశాన్ని కాంగ్రెస్ తన మేనిఫెస్టో నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆ పార్టీని అడుగడుగునా అడ్డుకుంటామన్నారు. పెద్దపల్లిలోని బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పాలన వల్లే దేశం అన్నివిధాలా నష్టపోయిందని ఆరోపించారు. ఆ పార్టీ కుటిల రాజకీయాలు ప్రజలందరికీ అర్థమయ్యాయని తెలిపారు. ఓటుబ్యాంకు, వారసత్వ రాజకీయాలు దేశంలో ఇక సాగవన్నారు. నాయకులు దాడి సంతోష్, పిడుగు కృష్ణ, తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, దిలీప్, తిరుపతి, రాజం మహంత, రాజేశ్, శ్రీకాంత్, రాజన్న, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్, రామారావులకు నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

జ్యోతినగర్(రామగుండం): సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఎస్టీపీసీ రామగుండం కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ జయంతి, అరుణోదయ రామారావు నాలుగో వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్ హాజరై, మాట్లాడారు. పెట్టుబడిదారీ గ్రంథాన్ని రచించి, ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప కమ్యూనిస్టు విప్లవకారుడు కారల్‌మార్క్స్ జయంతి జరుపుకోవడం నందంగా ఉందన్నారు. ఆయన కలలుగన్న సమాజం కోసం పోరాడాలని పేర్కొన్నారు. నేడు పెట్టుబడిదారులంతా సమాజ సంపదనంతా కష్టజీవులకు, శ్రమజీవులకు పంచకుండా ఒకేచోట కేంద్రీకృతం చేసి, సమానత్వం రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. పాలకులు కూడా వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉందన్నారు. కళ ప్రజల కోసమని నమ్మి, పేదల బాధలను పాటల రూపంలో వినిపించి, ప్రజలను చైతన్యవంతం చేసిన అరుణోదయ రామారావు లేని లోటు పూడ్చలేనిదన్నారు. ఊపిరి ఉన్నంతవరకు పాటనే తన ప్రాణంగా భావించిన మహనీయుడని కొనియాడారు. నాయకులు గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, కోడిపుంజుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీలో ఫ్రెషర్స్ డే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆకట్టుకుంది. మెడికోలు తమ ఆటపాటలతో సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్‌తోపాటు ప్రొఫెసర్లు స్టెప్పులేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య విద్యనభ్యసించే అవకాశం రావడం గొప్ప అదృష్టమని, దాన్ని దక్కించుకున్న వైద్య విద్యార్థులంతా తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సూచించారు. వేడుకల్లో నగర మేయర్ బి.అనిల్‌కుమార్, కార్పొరేటర్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


స్టెప్పులేస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

ఓబీ వెలికితీతపై వీడియో కాన్ఫరెన్స్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఓసీపీల్లో ఓబీ వెలికితీతపై డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్లకు కేటాయించిన ఓబీ లక్ష్యాలను పెంచుకోవాలని, వాటిని సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధమున్న ఓబీ వెలికితీతపై సీరియస్‌గా ముందుకెళ్లాలని సూచించారు. ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, సర్వే అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలివ్వాలి

గోదావరిఖని(రామగుండం): ఈ నెల 8 ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రామగుండంలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగులకు వృత్తి నైపుణ్యం అందించే టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయాలన్నారు.

జీడీకే–11 గని తనిఖీ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఆర్జీ–1 పరిధిలోని జీడీకే–11 గనిని డీడీఎంఎస్ ఎలక్ట్రికల్ గౌరవ్ అడ్డా శుక్రవారం తనిఖీ చేశారు. గనిలోకి దిగి, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గని ఏజెంట్ శ్రీనివాస్, మేనేజర్ నెహ్రూ తదితరులున్నారు.

19న జేబీసీసీఐ సమావేశం

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికుల జేబీసీసీఐ 11వ సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో బొగ్గు గని కార్మికుల అలవెన్స్‌పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

